క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ఉద్యోగులు

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం వల్ల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఆ స్థానంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను శనివారం అర్ధరాత్రికి పూర్తి చేసి సబ్‌స్టేషన్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఏఈ శేషసాయి తెలిపారు.

వచ్చే నెల 7న మాదిగల ఆత్మ గౌరవ కవాతు

సబ్బవరం: మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వచ్చే నెల 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని మాదిగ పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ కోరారు. సబ్బవరం సాయి నగర్ కాలనీలో ఆదివారం పెందుర్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఇందుగబిల్లి గోపి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాదిగల చిరకాల కోరిక మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటంతో త్వరలో సాకారం కానుందన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దువ్వి దర్గాలు, నీటిపల్లి ముత్యాలరావు, కొమ్ము కోటి, బొర్రా జయరాజు, మారడపూడి కోటి, ఇందుగబిల్లి పరదేశి, పీతలపాక పోలయ్య పాల్గొన్నారు.

విశేషంగా హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో ఆదివారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామివారి సీతారాముల ఉత్సవ మూర్తులను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. సంక్షిప్త రామాయణ పారాయణ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొత్తమ్మతల్లి అమ్మవారి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


అమ్మవారి జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గ్రామదేవత కొత్తమ్మ తల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకొని చేపట్టనున్న కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను ఆలయ కమిటీ ఆవిష్కరించింది. ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. 15వ తేదీన ఉజిడి తొలడం, 17వ తేదీన పుట్ట బంగారు మహోత్సవం, 18న ఘటాల ఊరేగింపు, 24న తొలేళ్ల పండగ, 25వ తేదీన అమ్మవారి ఊరేగింపు, అనుపు మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరిశెట్టి పెంటారావు, బొడ్డ గోవింద్, ప్రగడ శ్రీను, చిత్రాడ సన్యాసిరావు, మార్పు శేషు, దుగ్గపు దానప్పలు, అతికంశెట్టి రవి, గొనప సన్యాసినాయుడు, పారిపల్లి, బొడ్డ సన్యాసిరావు, వడ్లపూడి ఈశ్వరరావు, ఎస్.పాపారావు, సాగి సీతారామారాజు, ప్రగడ శంకరరావు పాల్గొన్నారు.

మరిడమ్మా...కాపాడమ్మా

- ఘనంగా అడవివరం పొలిమేర దేవత మరిడమ్మ పండగ
- భక్తిశ్రద్ధలతో పొలిమేర వరకూ సాగనంపిన గ్రామస్తులు
- చీరలు, పసుపు కుంకుమలు సమర్పించిన మహిళలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీనుబాబు, అధ్యక్షుడు వెంకటరావు తదితరులు


అడవివరం పొలిమేర వద్ద ఈటెలు, కర్రలతో వలయంగా అమ్మవారిని తీసుకొస్తున్న గ్రామస్తులు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత మరిడమ్మ(సత్తెమ్మ) పండగను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు గ్రామంలోకి రాకుండా చల్లగ చూడాలని పూజలు చేశారు. చిన్నా పెద్దా అంతా కలిసి అమ్మవారిని పొలిమేరకు సాగనంపారు. ఈ ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపొలిమేర దేవత మరిడమ్మకు రెండేళ్లకోసారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా తన అక్కచెల్లెళ్ల వద్దకు పొలిమేర నుంచి వచ్చేసిన మరిడమ్మను మళ్లీ సాగనంపే కార్యక్రమాన్ని ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. భక్తులతో అడవివరం నుంచి శ్రీనివాసనగర్ సమీపంలోని మరిడమ్మ ఆలయం వరకు ఉన్న రెండు కిలోమీటర్ల ప్రధాన రహదారి జాతరగా మారింది. మిట్ట మధ్యాహ్నం, మండుటెండను సైతం లెక్క చేయకుండా గ్రామస్తులు తరలివచ్చారు.


పొలిమేర వద్ద అమ్మవారి వెనుక ప్రదక్షిణ చేస్తున్న గ్రామస్తులు, మహిళలు

గాంధీనగర్‌లోని పైడితల్లి అమ్మవారి శతకం పట్టు వద్దకు గ్రామస్తులు, మహిళలు పసుపు కుంకుమలు, చీరలు, అమృత కలశాలతో చేరుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అమ్మవారి చెక్కబొమ్మను పూజారి వంశీయులు శిరస్సుపై పెట్టుకుని బయలు దేరారు. దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు అమ్మవారిని వెనక్కి నెట్టకుండా కర్రలు, ఈటెలతో వలయాన్ని ఏర్పాటు చేస్తూ గ్రామస్తులు అనుసరించారు. అమ్మవారు వెళ్లే దారిపొడవునా గ్రామస్తులు తమ ఇళ్ల ముందు పసుపు నీటితో మరిడమ్మ చెక్కబొమ్మకు అభిషేకాలు చేశారు. సింహాచలం నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలోని బాలాజీనగర్ సమీపంలోని పొలిమేర వద్దకు రాగానే మరిడమ్మను మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు. అక్కడి నుంచి అమ్మవారిని తీసుకెళ్లి మరిడమ్మ ఆలయంలో అధిష్ఠించారు. పసుపు, కుంకుమలు, చీరలు, పండ్లు సమర్పించి గ్రామస్తులు మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారి పూజారి వంశీయుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో పండగ నిర్వహించారు. ఆలయం వద్ద ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు. 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, టీడీపీ 98వ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు.

18న పైడితల్లమ్మ పండగ


అడవివరం గ్రామంలో చాటింపు వేస్తున్న అమ్మవారి సేవకుడు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి పైడితల్లి అమ్మవారి పండగ ఈ నెల 18న జరగనుంది. ఈమేరకు ఆదివారం సాయంత్రం గ్రామంలో చాటింపు వేశారు. 17న తొలేళ్ల ఉత్సవం, 18 రాత్రి అనుపు మహోత్సవం, 25వ తేదీన మారు వారం పండగ జరగనుంది. 18న అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గొర్లివానిపాలెం వద్ద ఇటీవల కుప్ప కూలిన 220 కేవీ విద్యుత్ స్తంభం మరమ్మతులు నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఫలితంగా గొర్లివానిపాలెం, పోర్టుకో, జాజులవానిపాలెం, పవర్‌సిటీ, దేశపాత్రునిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జికూటివ్ ఇంజినీర్ రామకృష్ణ పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

పరవాడ: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక జట్టు సహకారంతో ఈ నెల 10 నుంచి 25 వరకు ఇంటింట ధర్మ ప్రచారం నిర్వహించాలని మండల ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వెన్నలపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రాంతాల్లో ప్రతీ ఒక్కరిని కలుపుకొని ధర్మప్రచారం సాగించాలన్నారు. ప్రతీ నెలలో రెండో శనివారం దేవాలయం కేంద్రంగా సత్సంగం, భజన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఏకాదశికి నగర సంకీర్తన, భజన కార్యక్రమం, పౌర్ణమి రోజున సామూహిక హారతి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పైల శ్రీను, ఎం.హరిబాబు, ఎన్.సూర్యనారాయణ, ఎ.అయ్య, బి.అయ్యబాబు, వి.భాస్కర్, జె.గంగరాజు, పి.సన్యాసిరావు, పి.రామచంద్రరావు, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్‌లో గోపాలపట్నం విద్యార్థుల ప్రతిభ


185వ ర్యాంక్ సాధించిన రెడ్డి అనిల్


779 ర్యాంక్ సాధించిన బుద్ధ తన్మయ్

గోపాలపట్నం: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గోపాలపట్నం ప్రాంత విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెడ్డి అనిల్ 185వ ర్యాంక్ సాధించగా.. బుద్ధ తన్మయ్ 779వ ర్యాంక్ సాధించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయిలో స్థిర పడడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు. జీవీఎంసీ 92వ వార్డు నరసింహనగర్‌లో నివాసముంటున్న రెడ్డి అనిల్ ఓపెన్ విభాగంలో 185వ ర్యాకు సాధించాడు. ఓబీసీ విభాగంలో 21వ ర్యాంకు సాధించాడు. అనిల్ తండ్రి వెంకట సత్యసాయి నాయుడు డిఫెన్స్‌లో సివిలియన్‌గా పని చేస్తున్నారు. తల్లి పద్మ గృహిణి. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో మంచి మార్కులు సాధిస్తూ వస్తున్నాడు. ఐఐటీలో ఉన్నతంగా నిలిచి కంప్యూటర్స్‌లో స్థిరపడతానని చెబుతున్నాడు.

- 92వ వార్డు వెంకటాపురం శ్రీసాయినగర్‌కు చెందిన బుద్ధ తన్మయ్ తల్లిదండ్రులు గోవిందరావు, భూదేవి అధ్యాపకులుగా పని చేస్తున్నారు. తన్మయ్ ఓపెన్ విభాగంలో 779 ర్యాంకు, ఓబీసీలో 114ర్యాంకు సాధించాడు. ఉపాధ్యాయులు చెప్పిన సూచనలతో పాటు ఇంటి వద్ద తల్లి దండ్రులు శిక్షణ ర్యాంక్ సాధనకు దోహద పడ్డాచని చెబుతున్నాడు. కంప్యూటర్ పరిశోధకుడిగా, శాస్త్రవేత్తగా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు.


బ్రహ్మకుమారీల నూతన ధ్యాన మందిరం ప్రారంభం


బ్రహ్మకుమారీస్ అగనంపూడి నూతన ధ్యాన మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు


కార్యక్రమంలో పాల్గొన్న ధ్యానులు, బ్రహ్మకుమారీలు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అగనంపూడిలోని దివ్య జ్యోతి భవనం సారధ్యంలో నిర్మితమైన ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న భవనం ఆవరణంలోనే మూడో అంతస్తులో ధ్యాన మందిరం కోసం నిర్మించిన ఫ్లోర్‌ను ప్రారంభించారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకె వేణి అక్కయ్య, కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి విచ్చేసిన బీకే వేడి భాయీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి బ్రాంచ్ ద్వారా లోక కల్యాణం, విశ్వ శాంతి కోసం దివ్యజ్యోతి భవనం నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి శిక్షణ పొందే 150 మంది బ్రహ్మకుమారీలు ఉండేందుకు వీలుగా సౌకర్యం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ మనిషి ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడానికి, ధ్యానంతో మానసిక ప్రశాంతతను కల్పించేందుకు వీలుగా ఇక్కడ ధ్యానులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా బట్టీలు నిర్వహించడం ద్వారా పరిసర ప్రాంతంలో పాజిటివ్ ఆలోచనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య, ఇన్‌చార్జ్ రామకోటి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ, సక్కా రమణబాబు, విద్యావేత్తలు టి.బలరామకృష్ణ, బొండా అప్పారావు మాస్టార్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎల్.వి.రమణ, వివిధ బ్రాంచ్‌ల ఇన్‌చార్జ్‌లు, ధ్యానులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి


రిలే దీక్షలో పాల్గొన్న భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు వెనక్కు తీసుకోవాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీటు ఆధ్వర్యంలో 1,244వ రోజు చేపట్టిన రిలేని నిరాహార దీక్షలో భెల్ సీటు నాయకులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న భెల్ సీటు ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ మూడేళ్లకు పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సనపల జగన్నాథరావు, సత్యనారాయణ, అల్సి అప్పలనాయాయణ, కె.నారపురెడ్డి, చైతన్య, జి.అచ్చం నాయుడు, పి.శివరాం, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, భక్తులు


యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండంలోని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

క్రీడలు జీవితంలో భాగస్వామ్యం కావాలి


పోటీలను ప్రారంభిస్తున్న విశాల్ గున్నీ

దాబాగార్డెన్స్ : ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రేంజ్ పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ విశాల్ గున్నీ అభిప్రాయపడ్డారు. బీఎంసీసీ బిగ్ మ్యాన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ లీగ్ ప్రారంభ పోటీల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హోదాల్లో నిరంతరం సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వారంతా క్రీడలు ఆడటం ఆనందకరమన్నారు. క్రీడల ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండొచ్చన్నారు. క్రీడలకు వయస్సు అడ్డంకి కాదన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్, రోటరీ క్లబ్ ఇతర రంగాలకు చెందిన వ్యక్తులు క్రికెట్ ఆడటం సంతోషకరమన్నారు. బిగ్ మ్యాన్ క్లబ్ అధ్యక్షుడు, సీఏ తేజ, ఎస్ఎస్ఆర్ కార్యదర్శి డాక్టర్ సప్ప నరేష్ మాట్లాడుతూ ఈ పోటీలు వచ్చే నెల 28 వరకు ప్రతి ఆదివారం రైల్వే గ్రౌండ్ వేదికగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్మయ మిషన్ మాతృ, పితృ పూజ

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ, పితృ పూజ ఘనంగా నిర్వహించారు. చిన్మయ మిషన్ 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వామి రఘువీరానంద ఆధ్వర్యంలో 'బాలల కూల్ క్యాంప్' నిర్వహించారు. పిల్లలకు తల్లిదండ్రులపై గౌరరభావాలు పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంపై తల్లిదండ్రులు చిన్మయ మిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బాల బాలికలకు బహుమతులు అందజేశారు.

సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, భర్నికం, పరవాడ, లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఉత్సాహంగా గడిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.

ఎన్‌సీవోఏ ఉప ప్రధాన కార్యదర్శిగా కాటం


నూతన ఉపాధ్యక్షుడు కాటం చంద్రరావును అభినందిస్తున్న ప్రసాద్

ఉక్కునగరం: నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) ఉప ప్రధానకార్యదర్శిగా ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షుడు కాటం చంద్రరావు నియమితులయ్యారు. ఈనెల 7 నుంచి బెంగళూరు హెచ్ఎఎల్ అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సీఓఎ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా 2024–26కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీ జనరల్‌గా అనీల్ కుమార్, ఉప ప్రధానకార్యదర్శిగా కాటం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్టీల్ ఫెడరేషన్ చైర్మన్ ఎస్.కె. బంబోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుసుమ రాజశేఖర్‌లు ఎన్నికయ్యారు. సమావేశాలకు హాజరైన సీ ప్రధానకార్యదర్శి కేవీడీ ప్రసాద్ ఉక్కు కర్మాగారం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేసేలా సహకరించాలని కోరారు. కాటం చంద్రరావు మాట్లాడుతూ మారిన రాజకీయ పరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్ నార్ ప్లాంట్లను సెయిల్‌లో విలీనం చేయడానికి అనుకూల అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా హయ్యర్ పెన్షన్ అంశంపై కేంద్ర కార్మిక మంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీఓఎ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి


మాట్లాడుతున్న దొమ్మేటి అప్పారావు

అగనంపూడి: కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విశాఖ హెచ్ఎంఎస్ నాయకులు దొమ్మేటి అప్పారావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1214వ రోజు ఉక్కు హెచ్ఎంఎస్ యూనియన్ సారథ్యంలో దీక్షా శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపేశక్తి, సత్తా ఇప్పుడు రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులకు ఉందన్నారు. గతంలో పవన్ కల్యాణ్ తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో, అసెంబ్లీలో నిలదీస్తానని చెప్పారని, ఆయనపార్టీకి కూడా ఇద్దరు ఎంపీలు ఉన్నందున బీజేపీ మిత్రపక్షంగా ఉన్న జనసేన ఆ దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు గొందేసి సత్యారావు, యు.అప్పారావు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.